25122024-DIS-04_Layout 1 12/25/2024 2:07 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ప్రమాదంలో శాంతిభద్రతలు

కల్లబొల్లి కబుర్ల కాంగ్రెస్ సర్కారు చేతగాని పాలనలో నేరాలు విజృంభిస్తున్నాయి. ఓ వైపు శాంతిభద్రతలు క్షీణిస్తూ ఉంటే, మరోవైపు అభివృద్ధి అడుగంటుతున్నది. తాజాగా పోలీసు అధికారులు వెల్లడించిన గణాంకాలే అందుకు నిదర్శనం. రాష్ట్రానికి గుండెకాయ వంటి రాజధాని పరిధిలోని మూడు కమిషనరేట్ల లెక్కలను పరిశీలిస్తే పరిస్థితి నానాటికి తీసికట్టుగా తయారైందని తెలుస్తున్నది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఏడాదిలోనే నేరాలు 41 శాతం పెరిగాయి. దొంగతనాలు 66 శాతం పెరిగాయి. పరిష్కారమైన కేసుల సంఖ్య 67 నుంచి 59 శాతానికి పడిపోయింది. రాచకొండలో నేరాలు 4 శాతం పెరిగాయి. హత్యలు, సైబర్ నేరాలు, లైంగికదాడుల కేసుల్లో అధిక పెరుగుదల ఉండటం గమనార్హం. ఇక సైబరాబాద్‌లో అయితే నమోదైన కేసుల సంఖ్య ఏకంగా 64 శాతం పెరిగింది. ఈ పరిస్థితిని పోలీసు యంత్రాంగం ఏవేవో సాకులు చూపి సమర్థించుకోవాలని చూస్తుండటం విడ్డూరం. ఎఫ్ఐఆర్‌ల నమోదు సులభతరం చేయడం వల్ల కేసుల సంఖ్య పెరిగిందని ఒకరంటే, ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాల సిబ్బందిని గ్రేటర్‌కు తరలించడం వల్ల నిర్వహణాపరమైన సమస్యలు ఎదురయ్యాయని ఒకరంటున్నారు.

నేరపూరిత వాతావరణంలో సంపద సృష్టి సాధ్యపడదు. అభివృద్ధికి శాంతిభద్రతల అండదండలు తప్పనిసరి. అందుకే తెలంగాణ సాధకుడు కేసీఆర్ తొలుత నేరాల నియంత్రణపై దృష్టిపెట్టారు. ముఖ్యంగా మహిళల భద్రత కోసం వినూత్న పథకాలు చేపట్టారు. హాక్ ఐ, షీ టీమ్స్ వంటి చొరవలతో ప్రశంసలు అందుకున్నారు. ఆధునిక కమ్యూనికేషన్ సాధనాలు మొదలుకుని అధునాతన వాహనాల దాకా అన్నింటినీ సమకూర్చారు. కేంద్రీకృత నిఘా వ్యవస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మించారు. నూతన కమిషనరేట్లను ఏర్పాటు చేసి పర్యవేక్షణను విస్తరించారు. ఇలా ఒక్కో ఇటుక పేర్చుకుంటూ నేర నిరోధక వ్యవస్థను బలోపేతం చేశారు. ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2022లో తెలంగాణ పోలీసు అగ్రస్థానంలో నిలవడం ఈ కృషికి గుర్తింపుగా భావించాలి. బంగారు తెలంగాణకు ఇవన్నీ రక్షణ కవచాలయ్యాయి. కానీ, ఏడాదిలో అంతా తారుమారైంది.

ప్రశాంత తెలంగాణ భయాందోళనల తెలంగాణగా మారిపోయిందన్నది వాస్తవం. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత పెరిగిపోతున్న నేపథ్యంలో క్రమంగా రాష్ట్రం పోలీసు వలయంగా మారుతుండటాన్ని మనం చూస్తున్నాం. సామాన్యులను కేసులతో వేధించడం, సంకెళ్లు వేసి రైతులను నడిపించడం వంటి ఘోరాలు నిత్యకృత్యమైపోతున్నాయి. పైన తెలిపిన నేరాల వెనుక ప్రభుత్వ పర్యవేక్షణా లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. మరోవైపు పోలీసు యంత్రాంగాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకుని ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాల్సి ఉంది. ఎందుకంటే, శాంతిభద్రతలతో పాటు మొత్తంగా హోంశాఖ ఆయన దగ్గరే ఉంది. ప్రస్తుత పరిస్థితులు ఆయన పరిపాలనా ప్రావీణ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయనేది కాదనలేని వాస్తవం. ఇప్పటికైనా పూర్తిస్థాయి హోంమంత్రిని నియమించి దిద్దుబాటు చర్యలు చేపడితే బాగుంటుంది.

ఆయనకేం నష్టం.. తెలంగాణకే కష్టం!

బుద్ధా మురళి

మన ఆలోచనలను మన మాటలే బయటపెడతాయి. 'స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల విరాళాన్ని తిరిగి ఇచ్చేశాం. దానివల్ల నాకేమీ నష్టం లేదు, రాష్ట్రానికే నష్టం' అని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే, 'సినిమా వాళ్ల వివాదంతో సినీ పరిశ్రమ హైదరాబాద్ నుంచి విశాఖకు తరలిపోయినా నాకు ఎలాంటి నష్టం లేదు. నేను రెండేండ్లకోసారి సినిమా చూస్తా. అది హైదరాబాద్‌లో నిర్మిస్తే నాకేంటి? విశాఖలో నిర్మిస్తే నాకేంటి? నేనేమీ సినిమా రంగంపై ఆధారపడి బతకడం లేదు. అందుకే, సినిమా రంగం తరలిపోయినా నాకు ఎలాంటి నష్టం లేదు' అని తన కుటుంబమే కేంద్రంగా బతికే సాధారణ ఉద్యోగి మాట్లాడితే తప్పేమీ కాదు. కానీ, ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఒక నిర్ణయంపై నాకేమీ నష్టం లేదని తానే కేంద్రంగా జీవించడం, నిర్ణయాలు తీసుకోవడం, మాట్లాడటం తప్పు. రాష్ట్రానికి ఎలాంటి మేలు చేస్తుంది, ఎలాంటి నష్టం చేస్తుందనే కోణంలో తన ప్రతి నిర్ణయం ఉండాలి.

అదానీ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని ఎందుకు తిరిగి ఇస్తున్నారనేది స్వయంగా ముఖ్యమంత్రే విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. 'మీ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో అదానీ నుంచి అక్కడి సీఎం రేవంత్ రూ.100 కోట్ల విరాళం తీసుకుంటారు, మీరేమో అదానీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తారని ఢిల్లీలో అదానీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రాహుల్‌గాంధీని విలేకరులు ప్రశ్నించారు. అందువల్ల విరాళం తిరిగి వెనక్కి ఇస్తున్నా'నని రేవంత్ ప్రకటించారు. అసెంబ్లీలో మాత్రం పేద యువతకు ఉపయోగపడే స్కిల్ యూనివర్సిటీకి విరాళమిస్తే ప్రతిపక్షం ఓర్వలేక పోయిందని, అందుకే విరాళం తిరిగి ఇచ్చేస్తున్నామని చెప్పారు. అంతేకాదు, దానివల్ల తనకేం నష్టం లేదని, రాష్ట్రానికే నష్టమని కూడా పేర్కొన్నారు. అదానీ విరాళం గురించి ప్రస్తావించినప్పుడు తమ రాష్ట్ర యువతకు ఉపయోగపడే స్కిల్ యూనివర్సిటీకి విరాళం తీసుకుంటే తప్పేమిటని రాహుల్‌గాంధీని ప్రశ్నించాల్సింది. రాహుల్‌గాంధీకి ఇబ్బంది అయితే రాష్ట్రానికి నష్టం జరిగినా ఫర్వాలేదు. మరి విరాళం మాత్రమే తిరిగిచ్చి ఒప్పందాలను ఎందుకు కొనసాగిస్తున్నారు? అదానీ కంపెనీతో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందాల వల్ల రాహుల్‌గాంధీకి ఎలాంటి నష్టం లేదా? అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి నిర్ణయాలు రాష్ట్రానికి ప్రయోజనం కన్నా తన స్వప్రయోజనం కేంద్రంగానే జరుగుతున్నాయి.

సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ వెళ్లినప్పుడు జరిగిన తొక్కిసలాటలో ఒకరు మరణిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. కానీ, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా తీసుకున్నట్టు కనిపిస్తున్నది. అసెంబ్లీలో ఈ అంశంపై సీఎం సుదీర్ఘ ప్రసంగం, ఆ తర్వాత అల్లు అర్జున్ ఇంటిపై రౌడీ మూకల దాడి, సినిమా వాళ్లను తిడుతూ ఒక పోలీసు అధికారి మాట్లాడటం.. ఒక దాని తర్వాత ఒకటి జరిగాయి. శాసనసభలో సినిమావారి గురించి రేవంత్ మాట్లాడిన తీరు దాడిచేసినవారిపై ప్రభావం చూపిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు.

1969 తెలంగాణ ఉద్యమాన్ని సినిమావాళ్లు వ్యతిరేకించారు. ఆ తర్వాత జై ఆంధ్ర ఉద్యమాన్ని బహిరంగంగానే సమర్థించారు. కానీ, మలి దశ తెలంగాణ ఉద్యమం విషయంలో సినిమావాళ్లు మౌనంగానే ఉన్నారు. సినిమా రంగంలో ఇప్పటికీ ఆంధ్రావారిదే పూర్తి ఆధిపత్యం. అదేమీ రహస్యం కాదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఐటీ, సినిమా రంగం పరిస్థితి ఏమవుతుందనే ఆందోళన కనిపించింది. కానీ, అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఆ అపోహలను పటాపంచలు చేసింది.

> **తెలంగాణ వచ్చాక ఐటీ రంగం మరింత దూసుకువెళ్లింది. సినిమావాళ్లు నిర్ణయంగా తమ పని తాము చేసుకున్నారు. ఎలాంటి అభద్రతా భావానికి లోను కాలేదు. కానీ, ఇప్పుడు వారిలో ఒక విధమైన అభద్రతాభావాన్ని పాలకులే కలిగిస్తున్నారు. అల్లు అర్జున్ అంశాన్ని సీఎం తన భుజానికెత్తుకున్నట్టు కనిపిస్తున్నది.**

చివరకు అల్లు అర్జున్‌ను సాటి నటులు పరామర్శించడం కూడా సీఎంకు నచ్చలేదు. 'సరిహద్దుల్లో యుద్ధం చేసి వచ్చాడా? ఆయన కన్నుపోయిందా? కాలు పోయిందా?' అని ముఖ్యమంత్రి మండిపడ్డారు. అయితే, ఓటుకు నోటు సమయంలో రేవంత్ బెయిల్‌పై బయటకు వచ్చినప్పుడు టీడీపీ నాయకులు ఆయనను పరామర్శించారు. ఈ నేపథ్యంలో మరి అప్పుడు రేవంత్ సరిహద్దులకు వెళ్లి యుద్ధం చేసి వచ్చాడా? ఎందుకా పరామర్శలు? అని అప్పటి, ఇప్పటి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

సినిమావారి పట్ల తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు గమనిస్తున్న ఏపీ నాయకులు.. హైదరాబాద్ నుంచి సినిమా రంగం విశాఖకు తరలివస్తే స్వాగతిస్తామని చెప్తున్నారు. మద్రాస్ నుంచి వచ్చి ఎన్టీఆర్ పార్టీ పెట్టి సీఎం కాగానే సినిమా రంగం మొత్తం హైదరాబాద్‌కు తరలిరాలేదు. చెన్నారెడ్డి కాలం నుంచి ప్రయత్నాలు చేయగా చంద్రబాబు కాలం నాటికి తరలివచ్చింది. అప్పుడంటే నాలుగు దశాబ్దాల కాలం పట్టింది. కానీ, ఇప్పుడు టెక్నాలజీ పెరిగింది. ఇప్పుడు అంత సమయం పట్టదు. రేవంత్ భాషలో చెప్పాలంటే సినిమా రంగం తరలివెళ్లినా ఆయనకు ఎలాంటి నష్టం లేదు. వారికేమీ సినిమా వ్యాపారం లేదు.. నష్టం జరగడానికి.

సినిమా వాళ్ల పట్ల రేవంత్ వైఖరికి కారణం ఏమిటో తెలియాలి. రేవంత్ మాటలను చూస్తుంటే సినిమా రంగం పట్ల ఎప్పటి నుంచో వ్యతిరేకత ఉన్నట్టు అనిపిస్తున్నది. కానీ, అది నిజం కాదు. తెలంగాణలో అందరి కన్నా ఎక్కువగా సినిమావారితో సంబంధాలు ఉన్నది రేవంత్‌కే. సినిమావాళ్లు అందరూ సభ్యులుగా ఉన్న జూబ్లీహిల్స్ క్లబ్‌కు రేవంత్ చాలా కాలం అధ్యక్షుడిగా ఉన్నారు. ఇప్పుడున్న సినీ వారసులు చాలా మంది ఆయనకు ఆ క్లబ్‌లో మంచి మిత్రులు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో ఉద్యమకారులు జూనియర్ ఎన్టీఆర్ సినిమా విడుదలను అడ్డుకోగా.. అప్పుడు టీడీపీలో ఉన్న రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సంగతి తేలుస్తానని వెళ్లారు. రాంగోపాల్ వర్మకు కూడా సినిమాలపై సలహా ఇచ్చిన అనుభవం రేవంత్‌కు ఉంది. పరిటాల రవిపై వర్మ తీసిన సినిమా పట్ల మొదటిరోజు అస్సలు స్పందన రాకపోయేసరికి.. 'ఈ సినిమాలో ఎన్టీఆర్‌ను అవమానించారని గొడవ చేయించండి.. పబ్లిసిటీ వస్తుంద'ని తానే సలహా ఇచ్చినట్టు గతంలో ఆయనే చెప్పారు.

అయితే, రేవంత్‌కు అంత సాన్నిహిత్యం ఉన్న సినిమావారితో ఏం జరిగిందో బయటకు రావడం లేదు. సినిమా ఫంక్షన్‌లో తెలంగాణ సీఎం పేరు గుర్తుకురాక అల్లు అర్జున్ తటపటాయించారు. సినిమావాళ్లపై కక్షకు ఇదే కారణమని ఓ ప్రచారం ఉంది. తన రాజకీయ గురువు బాబు కోసం సినిమా రంగం విశాఖకు తరలించాలని ఇలా చేస్తున్నారనేది మరో ప్రచారం. ఈ ప్రచారం అంత నమ్మశక్యంగా లేదు. గురువు కోసం, అనుచరుల కోసం ఆలోచించేంత విశాల హృదయం కాదు ఆయనది. ఇగో దెబ్బతినడం వల్ల అంటే కొంత నమ్మవచ్చు కానీ, గురువు కోసం త్యాగం అంటే నమ్మశక్యంగా లేదు.

తెలంగాణ ఏర్పడగానే కొత్త ప్రభుత్వం కొలువైనప్పుడు సచివాలయంలో కొందరు జర్నలిస్టులు అప్పటి మంత్రి కేటీఆర్‌ను కలిశారు. అక్కడ తెలంగాణకు చెందిన ఓ వ్యక్తి తీసిన సినిమా సీడీ కనిపిస్తే చర్చ ఆ సినిమాపైకి వెళ్లింది. ఎవరో ఔత్సాహికులు సినిమా తీశారు. విడుదల కావడం లేదు. ఎవరో ఒకరు ఆ సినిమా కొనేలా చేయాలని కేటీఆర్‌పై ఒత్తిడి. అది వ్యాపారం. లాభం వస్తుందనుకుంటే కొంటారు. మనం చెబితే ఎందుకు కొంటారనేది కేటీఆర్ వాదన. ఆ చర్చలో సినిమా రంగం టర్నోవర్ గురించి చర్చ వచ్చింది. 'బేగంబజార్‌లోని ఓ గల్లీ టర్నోవర్ అంత ఉండొచ్చు. కానీ, వారి ప్రభావం చాలా ఉంటుంది. ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు' అంటూ సినిమా రంగం ఇక్కడి నుంచి తరలివెళ్లకుండా సామరస్యంగా వ్యవహరించాలని కేటీఆర్ చెప్పుకొచ్చారు. సినిమా రంగం వెళ్లిపోతే తనకేం లాభం, నష్టం అనే కోణంలో కాదు, రాష్ట్రానికి ఏం లాభం, ఏం నష్టం జరుగుతుందనే కోణంలో పాలకులు ఆలోచించాలి.

సినిమా రంగం తరలివెళ్లినా, రియల్ ఎస్టేట్ పడకేసినా, రాష్ట్ర ఆదాయం పడిపోయినా రేవంత్‌కు కలిగే నష్టం ఏమీ లేదు. ఆయన అత్యున్నత స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి ఇంకా పైకి ఎక్కే మెట్లు లేవు. తాను తీసుకునే దుందుడుకు చర్యల వల్ల ఆయనకు నష్టం లేకపోయినా రాష్ట్రం నష్టపోతుంది. కాంగ్రెస్ నష్టపోవడానికి ఏమీ లేదు. సువిశాల భారత దేశంలో కాంగ్రెస్ ఇప్పుడు కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలో మాత్రమే అధికారంలో ఉంది. ఈ మూడింట్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా అధికారం నిలబెట్టుకుంటుందా? అంటే చెప్పలేం. నిండా మునిగిన కాంగ్రెస్‌కు కొత్తగా వచ్చే నష్టం ఏముంది? అంతిమంగా కొత్తగా పుట్టిన తెలంగాణే నష్టపోతుంది.

> **సినిమా రంగం తరలివెళ్లినా, రియల్ ఎస్టేట్ పడకేసినా, రాష్ట్ర ఆదాయం పడిపోయినా రేవంత్‌కు కలిగే నష్టం ఏమీ లేదు. ఆయన అత్యున్నత స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి ఇంకా పైకి ఎక్కే మెట్లు లేవు. తాను తీసుకునే దుందుడుకు చర్యల వల్ల ఆయనకు నష్టం లేకపోయినా రాష్ట్రం నష్టపోతుంది.**

శివ శివా.. ఏమిటీ పాపం?

ఏనుగుల రాకేష్‌రెడ్డి

కోరిన భక్తుల కొంగు బంగారం, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ధర్మ క్షేత్రం వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి దేవాలయం. వేములవాడ రాజన్నను కేవలం తెలంగాణ, ఆంధ్రా ప్రాంత ప్రజలే కాకుండా, దక్షిణ భారతదేశ ప్రజలంతా ఎంతో భక్తితో కొలుస్తారు. నిత్యం వేలాది మంది ప్రజలు దర్శనం చేసుకొని మొక్కులు చెల్లిస్తారు. కొత్తగా పెళ్లి అయినా, ఇల్లు కట్టుకున్నా, పంట చేతికి వచ్చినా, తీర్థ యాత్రలు చేయాలన్నా, మొదట రాజన్ననే దర్శించుకుంటారు, మొక్కులు చెల్లించుకుంటారు. కోరిన కోర్కెలు నెరవేరితే కోడెను కడతామని కోడె మొక్కులు మొక్కుతారు. ఈ కోడెను కట్టడానికి ఎంతో విశిష్టత ఉంది. శివుడి వాహనం నంది, అంటే ఎద్దు. వాటినే కోడెలుగా రాజన్నకు మొక్కులు చెల్లిస్తారు.

భక్తుల కోర్కెలు రోజంతా విని, అందరికీ దర్శన భాగ్యం ఇచ్చిన తర్వాత తిరిగి ఆ పరమ శివున్ని కైలాసానికి మోసుకెళ్లేది ఆ నందే. కాబట్టి, పరమ శివుడికి ఎంతో ప్రియమైంది, ఆత్మీయమైంది ఆ నంది. అలాంటి, నంది వాహనాన్ని పరమశివుడి ముందు సమర్పించే గొప్ప సంస్కృతి మన వేములవాడలో ఉంది. మన ఇంట్లో, మన దొడ్లో మన ఆవుకు జన్మించిన లేగ దూడను దేవుడికి కానుకగా ఇచ్చే ఈ పద్ధతి చాలా విశిష్టమైంది. మన దొడ్లో, మన ఆవులకు పుట్టిన దూడలకు మనం ఎంత ప్రాధాన్యం ఇస్తామో మనందరికీ తెలుసు. పదేండ్ల క్రితం వరకు ఫ్యామిలీ ఫొటో తీసుకుంటే అందులో ఎడ్లు, ఆవులు కూడా ఉండేవి. రైతులు తమ జోడెడ్లతో ఫొటో తీసుకొని ఫ్రేం కట్టించి ఇంట్లో పెట్టుకుంటారు. గోవులతో, ఎడ్లతో మనకు అంతటి ఆత్మీయ బంధం ఉంటుంది.

'రాజన్న ఓ రాజన్న' అంటూ, 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా' అంటూ ఉద్యమంలో సైతం రాజన్నను స్మరించుకున్నాం. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ తదితర ప్రాంతాల్లో రాజన్న, రాజమ్మ, రాజేష్, రాజేశ్వర్, రాజు అంటూ ఆ రాజరాజేశ్వరుడి పేరు లేని కుటుంబాలు లేవంటే అతిశయోక్తి కాదు. అంతటి విశిష్టత గల ఆ రాజన్న కోడెలను ఆ పరమ శివుడికే ప్రత్యక్షంగా సమర్పిస్తున్నామని భావిస్తాం. అందుకే, తమ దొడ్లో పుట్టిన లేగ దూడలను దేవుడి సన్నిధిలో భక్తులు సమర్పిస్తారు. అటువంటి కోడెలను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన అనుచరులు సొమ్ము చేసుకోవడం కోసం కబేళాలకు అమ్ముకోవడం దుర్మార్గం, ఘోరమైన అపచారం. ఇది నందీశ్వరుడికి జరిగిన అవమానం. వారు అమ్మింది దేవుడి కోడెలనే కాదు, కోట్ల మంది హిందువుల నమ్మకాన్ని, భగవంతునిపై భక్తులకు ఉన్న భక్తిని. బలికి పంపింది లేగలనే కాదు, లక్షల మంది తెలంగాణ ప్రజల ఆచారాన్ని, ఆనవాయితీని. కాంగ్రెస్ ప్రభుత్వం, కొండా సురేఖ చేసిన ఈ పాపం కాశీకి పోయినా పోదు.

రాజు తప్పు చేసినా, మంత్రి తప్పు చేసినా ఆ పాపం తాలూకు ప్రభావం రాజ్యం మీద, ప్రజల మీద ఉంటుంది. దేవుడి మీద ఒట్టు వేసి మాట తప్పినందుకే మేడారంలో వేలాది చెట్లు నేలకొరిగాయి. ఇటీవల భూకంపం వచ్చింది. ఇప్పుడు ఏకంగా ఆ పరమేశ్వరుడి కోడెలను కోతకు పంపి, హింసించి హత్య చేశారు. రేపు జరిగే నష్టానికి బాధ్యులెవరు? అందుకే, ఈ అపచారానికి ప్రాయశ్చిత్తంగా తెలంగాణ కోసం వేములవాడలో ముడుపు కట్టిన పార్టీగా వేములవాడ విశిష్టతను కాపాడటానికి కేటీఆర్ సూచనల మేరకు వరంగల్ నుంచి కోడెలను తీసుకెళ్లాం. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కోడెలను వేములవాడ వీధుల్లో ఊరేగించి, రాజన్నకు అప్పజెప్పి, శాంతి హోమం నిర్వహించి, గోశాలను శుద్ధి చేసి, అక్కడ జరిగిన తప్పును ఎత్తిచూపితే కానీ, దేవుడి కోడెల విషయంపై స్పందించాలని ప్రభుత్వానికి సోయి రాలేదు. అయినా కలెక్టర్‌తో విచారణ చేయిస్తామంటే సరిపోతదా? తనకు తెల్వకుండా పంపిణీ చేశారని కలెక్టర్ చెప్పారంటే.. మంత్రి చెప్తేనే పంపిణీ చేసినట్టు అర్థం కావటం లేదా?

రాజన్న కోడెల తరలింపు అంశంలో తప్పు జరిగింది కాబట్టే, నిందితులైన కొండా సురేఖ అనుచరుల మీద గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కానీ, అసలు కారకురాలైన మంత్రి కొండా సురేఖ పేరు అందులో చేర్చకపోవడం దారుణం. ఆమె మంత్రి హోదాలో ఏకంగా పోలీస్ స్టేషన్‌లో సీఐ కుర్చీలో సైతం కూర్చొని లా అండ్ ఆర్డర్‌ను చేతుల్లోకి తీసుకోగల సమర్థవంతమైన మహిళా నేత కాబట్టే చేర్చలేదా? దేవాదాయ శాఖను నిర్వహిస్తూ దేవుడి ఆస్తులకు ధర్మకర్తగా ఉండాల్సిన మంత్రే దొంగలకు సద్దులు మోస్తూ ధర్మాన్ని అవహేళన చేస్తున్నారు. దేవుడి సొమ్ముకే రక్షణ లేకపోతే ఇక ప్రజల సొమ్ముకు రక్షణ ఎక్కడుంటుంది? తనకు తెలియకుండానే కోడెల తరలింపు జరిగిందని స్వయంగా కలెక్టర్ చెప్తున్నారు. అంతా అయిపోయాక ఇప్పుడు జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కలెక్టర్.. మంత్రి ఆదేశాలు పాటించే అధికారే కాబట్టి ఆయనను అదిమిపెట్టడం, విచారణను ప్రభావితం చేయడం పెద్ద విషయం కాదు. అందుకే, విచారణ పారదర్శకంగా జరగాలంటే కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలి. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేయాలి.

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ దేవాలయం మీద, కోట్లాది హిందువుల మనోభావాల మీద, రాజన్న భక్తుల విశ్వాసాల మీద ఇంత దాడి జరుగుతుంటే దేశంలోని, రాష్ట్రంలోని ప్రముఖ మీడియాలకు కనిపించకపోవడం, వినిపించకపోవడం విడ్డూరం. కుమారి ఆంటీ, మోహన్‌బాబు ఇంట్లో గొడవ, అల్లు అర్జున్ అరెస్టు విషయంలో ప్రతీ అరగంటకు లైవ్ పెడుతూ గగ్గోలు పెట్టిన వాళ్లు ఈ అంశంపై స్పందించకపోవడం బాధాకరం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)

కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్‌టీ) గత పక్షం రోజులుగా చేస్తున్న ఉద్యమానికి బాలల హక్కుల సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నది. రాష్ట్రంలో సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో పనిచేస్తున్న వేల మంది ఉద్యోగులు సమ్మె బాటపట్టారు. అయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదు.

సమగ్ర 'శిక్ష'..

మాకేదీ రక్ష!

ఇంజమూరి రఘునందన్
98661 02962

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగుల ధర్నా టెంట్ల వద్దకు వచ్చి 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా'మని నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కానీ, నేడు ఊసే ఎత్తడం లేదు. తెలంగాణలో 479 కేజీబీవీలు ఉండగా.. వాటిల్లో 1.25 లక్షల మంది విద్యార్థినులు చదువుతున్నారు. సుమారు 20 వేల మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. అదే విధంగా మండల, జిల్లా కార్యాలయాల్లో చాలామంది సేవలందిస్తున్నారు. అయితే, వెట్టిచాకిరి చేస్తున్న వారికి కనీస వేతనం కూడా అందడం లేదు. ఉద్యోగ భద్రత కూడా లేదు. రెగ్యులర్ ఉద్యోగులు పొందుతున్న సౌలభ్యాలు వారికి అందడం లేదు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న సుప్రీంకోర్టు తీర్పు వర్తింపజేయడం లేదు. పంజాబ్, మణిపూర్, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని సమగ్ర శిక్ష ఉద్యోగులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు క్రమబద్ధీకరించాయి. తమను కూడా రెగ్యులర్ చేయాలని తెలంగాణ ఉద్యోగులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష శాసనసభ్యులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కానీ, ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం శోచనీయం.

'ఇవేమీ గొంతెమ్మ కోర్కెలు కావు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే సచివాలయానికి పిలిచి, మీ డిమాండ్లను నెరవేరుస్తాం' అని సమగ్ర శిక్ష ఉద్యోగులకు గతేడాది అట్టహాసంగా రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. చాయ్ తాగినంత సమయంలో వారి సమస్యలు పరిష్కరిస్తామని కూడా చెప్పారు. కానీ, ఇప్పుడు పక్షం రోజులుగా ఆందోళన చేస్తున్నా పాలకులు మాత్రం కనికరించడం లేదు. 'మేము కడుపు మండి ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తుంటే, విజయోత్సవాలు చేసుకుంటూ అధికారులు పట్టించుకోవడం లేద'ని ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులు సమ్మెలో ఉండటంతో విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడుతున్నది. కాబట్టి, దీన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించి వెంటనే వాళ్ల డిమాండ్లను నెరవేర్చాలి. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి. రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి.

(వ్యాసకర్త: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బాలల హక్కుల సంక్షేమ సంఘం)

మనసారా ప్రేమిద్దాం

మల్లెపూల వర్ణమాలల్ని అల్లుకొని
విజ్ఞాన సౌరభాల్ని విచ్చుకుంటున్న
పుస్తక పువ్వుల్ని తనివితీరా ఆస్వాదిద్దాం

ప్రాచీన ప్రాభవాన్ని నవీన నైజాన్నీ
పుటలు పుటలుగా తెరుద్దాం
చెలిమి చూపులతో కరచాలనం చేద్దాం
ఆత్మీయ ఆలింగనాలతో హత్తుకుందాం

పుస్తకం హస్త భూషణం కాదనీ
మస్తిష్కానికి నేస్తమనీ
కలాలు గర్జించే వరకూ
కవిత్వ బలాలు శాసించే వరకూ
నిరంతరంగా.. తరంతరంగా
పాటై పల్లవిద్దాం
మాటై ముచ్చట పెడదాం
ఆటై అల్లరి చేద్దాం...

మనసున మనసై ఘూర్ణిల్లటానికి
మనిషిని మనిషిగా పూర్ణించటానికి
మంచి పుస్తకాల్ని మనువాడుదాం
మనలో అర్ధాంగి పుస్తకమే అందాం
విజ్ఞాన వికాసాల్ని పొత్తంగా కందాం

అక్షరాల ఆత్మీయ బంధువులతో
బుక్ ఫెయిరుల్లో విజ్ఞాన విందులు చేద్దాం
పాశ్చాత్య పోకడల్లో
చెదలు చెదలుగా రాలుతున్న మెదళ్లనూ
బిజీబిజీగా శ్వాసిస్తున్న
గుండె గదుళ్లనూ
పుస్తక పఠనాలతో పూడ్చేద్దాం..
దాశరథి ప్రాంగణాన్ని దర్శ